
శర్మా, శాస్త్రీ, గోపీ, చలపతీ- వీరి సగటు వయస్సు డబ్బై ఉంటుంది. సాయంకాలపువేళ పైడాబామీద కలుసుకుని కబుర్లాడుకుంటేగాని ఏరోజూ వాళ్లకి తృప్తిగా ఉండదు. ఆనాటి సాయంకాలం శర్మ రిమార్కుతో వాళ్ల సమావేశం చిన్న మలుపు తిరిగింది. ఇంతకీ అతను అన్నదిదీః

# ముసిలాళ్లంతా సాటీళ్లేనా?



'అదేమిటీ, చలపతి  అలా మూలకి వెళ్లి అటుతిరిగి పడుకున్నాడూ?'

'వాడికెందుకో అలకొచ్చినట్టుంది' అని శాస్త్రి జవాబు చెబితే-

'డబ్భైదాటి ఈ వయసులో మనకింకా అలకలేమిటండీ, నా బొందా!' అని కొట్టిపారేశాడు గోపీ.

'రెండో బాల్యంకదా, ఏం చేస్తాం! అన్నిటికంటె విచిత్రమేమిటంటే శర్మగారూ, ఇంకా బాగా చీకటిపడకుండానే మీరీవేళకి ఇలా డాబామీదకి దయచెయ్యడమే' అని వ్యంగ్యం ఒలకపోశాడు శాస్త్రి.

'పని తీరికలేక రానుగాని ఇంచుమించు ఓ వయసువాళ్లం. మీతో కష్టం సుఖంచెప్పుకోవాలని నాకు మాత్రం ఉండదూ? ఈ ఏడంతస్తుల మెట్లూ ఎక్కి ఎందుకు వచ్చానంటారు మరి' అని సంజాయిషీ ఇచ్చుకున్నాడు శర్మ.

గోపీకి కాస్త సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఎక్కువ.

'ఏనాడో అన్నాడుకదా శ్రీశ్రీ, అందుకనేమో అనుకు

డాక్టరు
అవసరాల రామకృష్ణారావు

న్నానైండి.'

'ఏమని?'

'పోదాం పోదాం పైపైకి' అని.

'అంటే? ఇంకా అభివృద్ధి సాధించాలని అర్థంగాని ఎపార్ట్‌మెంట్స్ ఎక్కి పై డాబామీదకి చేరుకోవాలనా?'

'అయితే ఇందులోనూ ఓ సుళువుందండోయ్'

'ఏమిటో అది?'

'పండువృద్ధులమైన మనం అతితొందర్లో పైకి చేరుకోవలసిన వాళ్లంకదా... ఇంతటి ఎత్తయిన ప్రదేశానికి ముందే చేరుకుని ఉంటే పైకి చేరే దూరం తగ్గినట్టవుతుంది.'

'అలా జరిగేనో లేదోగాని మనం ఇలాంటి మరీ ఎత్తయిచోట హరీమంటే మనల్ని దింపుకోలేక మనవాళ్లు చావాలి ముందు.'

ముగ్గురు ముదివగ్గులూ గొల్లున నవ్వుకున్నారు. చలపతి మాత్రం కస్సుమన్నాడు.

'ఇందాకట్నుంచి వింటున్నాను. ఇలాంటి అశుభపు కబుర్లు చెప్పుకుంటూ మీకు నవ్వెలా వస్తోందర్రా! నూరేళ్ల బతుకన్నారు. ఇంకా ముప్పైఏళ్లు గ్యారంటీ.'

'చలపతీ, ఒకటడుగుతాను నీకు కోపం రాదుకదా!' అన్నాడు శర్మ.

'నా కోపాని నాకన్నపిల్లలే ఖాతరు చెయ్యలేదు. అడుగు, దానికేం?'

'మనదేశం సగటు ఆయుర్దాయాన్ని మించే మనం బతికేస్తున్నాం. చెప్పాలంటే బోనస్ ఏళ్లు ఎంజాయ్ చేస్తున్నాం. కూటికీ గుడ్డకీ లోటు లేదు. ఇంకా ఏదో ఉట్టిగట్టుకు ఊరేగుదామనే కోరిక న్యాయమంటావా?' శర్మ ఉవాచ చలపతి కెప్పుడూ ఓ గడ్డిపోచ. ఎగిరి కంట్లో పడ్డాడిలా.

'అన్నీ అనుకున్నట్టు జరువుకుంటున్న అదృష్టవంతుడివి. నీకేం నాయనా! ఎన్నయినా చెబుతావ్. జుర్రున చీది ఎరగవు నువ్వు. శిథిలమైన శరీరాలు మావి. ఇంతకీ ఇవాళ ఏం జరిగిందో ఒక్కడూ అడిగి చావడేం?'

చలపతి మొహం చూసి అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు.

అతనే చెప్పేడు, 'వాళ్ళకి పడదుకదా అని ఏదో తప్పు చేసినట్లు వరండాలో ఓ మూలకి వచ్చి రహస్యంగా వెలిగించుకున్నాను, చుట్ట. ఇలా రెండు దమ్ములు లాగేనో లేదో మా మనవడు వెధవ వచ్చి లాక్కుని అవతలకి విసిరేస్తాడా? ఇంటిల్లిపాదీ నవ్వుతారా! ఏం, నాకా మాత్రం స్వతంత్రం లేదూ? నా బరువు నేను మోసుకుంటున్నాను కద...'

'పరువుగా బతికితే బరువు అట్టే బాధించదులే' అన్నాడు చటుక్కున శర్మ.

'అలా అనడంలో నీ ఉద్దేశం? ఏదో ఓ చురక అంటించండే, ఓ వాత పెట్టండే, నీ నోట మాట రాదుకదా...'

'ఏం చెయ్యను? నా నాలిక అలాంటిదేమరి? అని ఒప్పుకున్నాడు శర్మ. అవకాశం దొరికంది గనక చలపతి ఊరుకోదల్చుకోలేదు.

'నాలిక ఒకటేనా? ఛీఫ్ సర్జన్‌గా రిటైరయ్యావు. ఎన్ని ఆపరేషన్లు చేసి ఈ పాటికి ఎన్ని వందల మందిని గట్టెక్కించి ఉంటావో...'

'నువ్వలా అనడం న్యాయం కాదు. సర్జనులందరూ దుర్జనులు కాదు'

'ఏమో బాబూ... మాలా నువ్వు ముక్కుతూ మూలుగుతూ లేవుకదా! నీకుడబ్బె దగ్గిర పడిందంటే ఎవరైనా నమ్ముతారా?'

'మరే... శర్మగారు మంచి స్పోర్ట్స్‌మెన్ అని కూడా విన్నాను. అందుకే ఈ వయసులో కూడా ఇంత దిట్టంగా ఉన్నారేమో!' అన్నాడు గోపీ.

''కాలేజీ డేస్‌లో గేమ్స్‌లో పాల్గొనవద్దని మిమ్మల్నెవరైనా అడ్డుపెట్టేరా? వయసులో చేసిన వ్యాయామం జీవితమంతా కాపాడే భీమా పథకం'

'నలభీమా పథకం అంటే సరిపోతుందేమో' అన్నాడు గోపీ నవ్వుతూ. అదేమిటో వివరించమని తక్కున ఇద్దరూ పట్టుపట్టేరు.

'చెబితే శర్మగారు ఏమనుకుంటారో' అని నసిగాడు గోపీ.

'చెప్పండి పర్వాలేదు' అని అభయమిచ్చాడు శర్మ.

'మరేంలేదు. ఇంట్లో మూడు పూటలా చెయ్యి కాల్చుకునేది శర్మగారేనుట. వారి ఆరోగ్య మహాభాగ్యానికి అంతర్రహస్యం అదేనట!'

శాస్త్రీ, చలపతీ గొల్లున నవ్వేశారు.

'ఎంత బాగా చెప్పేరు గోపీ... మీరు విన్నది నూటికి నూరుపాళ్లూ నిజం' అంటూ శర్మ సీరియస్‌గా చెప్పడంతో వారి నవ్వుకి బ్రేకు పడింది.

'ఆమాట నలుగుర్లో ఒప్పుకోడానికి సిగ్గుగా లేదూ?' అని చలపతి నిలదీశాడు.

శర్మ చెక్కుచెదర్లేదు. మెల్లగా గంభీరంగా చెప్పుకొచ్చాడు.

'ఎందుకూ సిగ్గు పడడం? ఇంట్లో వాళ్ళకి సాయపడకుండా, చేసిన దాంట్లో లోపాలు వెదుకుతూ, ఏ పడక్కుర్చీలోనో విలాసంగా మూలుగుతూ పడుకుంటే సిగ్గుపడాలి. గతకాలపు ఘనకార్యాల ఊబిలోంచి బయట పడలేకపోతే సిగ్గుపడాలి.'

'అయితే? పడుచువాళ్లని కూచోపెట్టి నడుం వంగిన మనం వండివార్చాలా?'

'తప్పేముంది? బతికున్నన్నాళ్లూ మా ఆవిడ వండిపెట్టేది. ఇప్పుడు వండి పెట్టడానికి నేను బతికున్నానని సంతోషిస్తున్నాను. మునపటి కాలం కాదు. మునపటి కోడళ్లు కాదు. ఉద్యోగాలు చేసి నెలనెలా బంగారుగుడ్లు పెట్టే కోళ్లు వాళ్లు. ఏదో పించెను డబ్బులు వాళ్ల చేతిలో పెడుతున్నాంకదా అని ముసిలాళ్లు పింఛెం విప్పి ఆడాలని అనుకుంటే అంతకుమించిన వంచన ఉండదు.'

'ఏమిటి శర్మా ఈ లెక్చరు? మేం అడిగింది ఏమిటి...? చలపతి అడ్డుపడబోయాడు.

'నన్నాపకండి. ఈ రోజుల్లో ఉదయం ఎనిమిది దాటకుండా ఆడా మగా చిన్నా చితకా టిఫిన్ బాక్సులు పట్టుకుని వీధిన పడుతున్నారు. ఇక మళ్ళీ చీకటి పడితేనేగాని ఇల్లు పట్టరు. ఈ జీవనవేగాన్ని తట్టుకోలేకపోతే మనలాటివాళ్లు నిలబడేది ఎలా? ఇంట్లో ఇరవైనాలుగ్గంటలూ పడుండే ముసిలాళ్లు ఆ మాత్రం వంట సాయం చేస్తే తప్పా? ఏ ఎనిమిదికో ఇల్లు చేరిన అలసిపోయిన కోడలికి ఓ అరకప్పు టీ చేసి ఇస్తే ఇక మావగారి మగతనం మంటకలిసిపోయినట్టే?'

'నేడో రేపో అన్నట్టున్నాం. ఇంకా ఘనం చాకిరీ చెయ్యాలటయ్యా?' అన్నాడు శాస్త్రి.

'నేడో రేపో అంటున్న మనమే ఎంచక్కా ఏడంతస్తులూ ఎక్కి చకచకా ఇక్కడ చేరుకున్నాం. ఈ పాటిగా ఉన్నాం. సంతోషించి ఇంట్లో వాళ్లకైనా కాస్త సాయపడరాదా? బలవంతమేమీలేదు. మన వయస్సుకి తగిన పనులే చెయ్యొచ్చుగదా! బట్టలు ఉతకలేకపోవచ్చు, ఆరిన బట్టలు తీసి మడతపెట్టలేమంటారా! 'పెద్దల్ని గౌరవించవలెను' అనిపించుకోవాలంటే ముందు మనం పెద్దల్లా ప్రవర్తించాలిగదా! ఇంతకీ ఎంత ఒంటరివాళ్లమైనా, వృద్ధులమైనా, జీవితం అనేది ఎవరికి వారు ఆస్వాదించే కల్లుముంతగా చేసుకుంటే ఎలా? ఏమాత్రం శక్తి ఉన్నా అది నలుగురితో పంచుకుంటే అమృతభాండం అవదా!' అని ముగించాడు శర్మ.

●

